క్లుప్తంగా

భారతి సిమెంట్‌తో దృఢమైన నిర్మాణం

సంస్థ టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్



మేస్త్రీలకు బీమా పత్రాలను అందజేస్తున్న శ్రీకాంత్

షాద్‌నగర్‌రూరల్: నిర్మాణ రంగంలో భారతి సిమెంట్ ఎంతో దృఢమైనదని సంస్థ టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్ అన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని ఎస్‌వీఎం ట్రేడర్స్ వద్ద భవన నిర్మాణ మేస్త్రీల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేస్త్రీలకు ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. అనంతరం సంస్థ టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ ఎంతో మన్నికైనదని అన్నారు. దీన్ని వినియోగిస్తే నిర్మాణ పనుల వేగవంతంగా పూర్తి అవుతాయన్నారు. భారతి సిమెంట్ సంస్థలో నిపుణులైన ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయ పడతారని అన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఎం భరత్‌కుమార్, డీలర్లు నవీన్‌కుమార్‌గుప్తా, అశోక్‌కుమార్‌గుప్తా, మేస్త్రీలు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



సీఐ ప్రతాప్‌లింగంను సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

షాద్‌నగర్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ఉత్తమ సేవా పథకానికి ఎంపికైన షాద్‌నగర్ పట్టణ సీఐ ప్రతాప్‌లింగంను పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో సీపీఐ నాయకులు సీఐ ప్రతాప్‌లింగంకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రజల మధ్య తారతమ్యాలు లేకుండా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా పథకాలను అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకటేశ్, చెన్నయ్య, ఏఐటీయూసీ నాయకులు నర్సింహ్మా, కృష్ణ పాల్గొన్నారు.

ఆర్‌ఐ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని వినతి

షాద్‌నగర్‌రూరల్: మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల రెవెన్యూ కార్యాలయంలో ఆర్‌ఐగా పనిచేస్తున్న వెంకట్‌రెడ్డి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని టీఎన్జీఓల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు టీఎన్జీఓల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ.. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి బాలానగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐగా పనిచేస్తున్న వెంకట్‌రెడ్డిని తీవ్ర పదజాలంతో దూషించారన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఘటనను పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి సస్పెన్షన్ విషయంలో పునఃపరిశీలించి సస్పెన్షను ఎత్తివేయాలని, తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు ఉత్తర్వులను జారీ చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో టీఎన్జీఓల సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, ప్రచార కార్యదర్శి శ్రీహరి, జిల్లా కార్యవర్గ సభ్యులు తేజ్‌కుమార్, భీమ్లానాయక్, చిట్టిబాబు, వెంకటేశ్వర్లు, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆస్పత్రికి కుర్చీల బహూకరణ



కుర్చీలు బహూకరిస్తున్న కౌన్సిలర్ నర్సింలుగౌడ్

కొత్తూరు: పట్టణంలో ఉన్న పశువుల ఆస్పత్రికి స్థానిక కౌన్సిలర్ మాదారం నర్సింలుగౌడ్ బుధవారం తన సొంత ఖర్చులతో కుర్చీలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన వార్డు పరిధిలో ఉన్న ఆస్పత్రిలో రైతులు, సిబ్బంది కూర్చోడానికి వీలుగా కుర్చీలు కావాలని తనను సంప్రదించగా వెంటనే సమకూర్చినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో తనవంతుగా మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు స్ఫూర్తి, నాయకులు శ్రీనివాస్, శ్రీనుగౌడ్, వెంకటేశ్, మాదారం కృష్ణ, జనార్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వాగు దాటుతున్న విద్యార్థులు(ఫైల్)



వాగుపై బ్రిడ్జి ఇలా..

నాడు అధ్వానం.. నేడు అద్భుతం

- వాగు దాటాలంటే భయపడిన వైనం
- నాడు బురదలోనే ప్రయాణం
- రోడ్డు, బ్రిడ్జి నిర్మాణంపై స్థానికుల హర్షం
- మంచన్‌పహాడ్ గ్రామస్తుల కల నెరవేరిన వేళ



గతంలో మట్టిరోడ్డు(ఫైల్)



పస్తుతం సీసీరోడ్డు ఇలా..

నందిగామ: ఆ గ్రామం ఓ మారుమూల అనుబంధ గ్రామం. ఆ గ్రామం నుంచి వర్షాకాలం బయటకు వెళ్లాలంటే వాగు దాటాలి. చిన్నపాటి వర్షం కురిసినా వాగు వస్తుంది. వాగు దాటాలంటే గ్రామస్తులకు నరకమే. పాఠశాల విద్యార్థులు, వ్యవసాయదారులు, గ్రామస్తులు వాగు వచ్చిందంటే చాలు ఇక ఊరిలోనే ఉండిపోవాల్సిందే. ఉదయం పాఠశాలకు, వ్యవసాయ పొలాలకు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు సాయంత్రం ఇంటికి వచ్చేందుకు వర్షాకాలంలో వాగు వద్దకు రాగానే ఎప్పుడు ప్రవాహిస్తుందో తెలియని పరిస్థితి. ఇది మండల పరిధిలోని మొదళ్లగూడ అనుబంధ గ్రామమైన మంచన్‌పహాడ్ గత దుస్థితి.

ప్రస్తుతం ఇలా..

అద్దంలా మెరిసే రెండు వరుసల సీసీరోడ్డు.. రోడ్డు మధ్యలో స్ట్రీట్ లైట్లు.. వాగు ఉన్న చోట బ్రిడ్జి నిర్మాణం.. రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు.. ఏ రాత్రయినా, పగలైన, వాగు వచ్చినా సరే గ్రామస్తులు, విద్యార్థులు, వ్యవసాయదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా హాయిగా ప్రయాణిస్తున్నారు.

స్వచ్ఛందంగా ముందుకు వచ్చి..
గ్రామస్తుల సమస్యను తీర్చి..

గ్రామ తాజా మాజీ సర్పంచ్ నాగర్‌కుంట ఉమారెడ్డి ఏ మాత్రం ప్రభుత్వ నిధులపై ఆధారపడకుండా, తన మరిది ప్రస్తుత మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి సహకారంతో స్వచ్ఛందంగా తాను సొంత ఖర్చులతో పాటు ఆ రోడ్డు పక్కనే ఉన్న ఓ విశ్వవిద్యాలయం ఆర్థికసాయాన్ని తీసుకొని రూ.కోట్ల వ్యయంతో రోడ్డును అద్దంలా తీర్చిదిద్దడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొదళ్లగూడ గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి సుమారు 1 కిలోమీటరు వరకు రెండువైపులా సీసీరోడ్డు, స్ట్రీట్‌లైట్లు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, వాగు ఉన్న చోట బిడ్జి నిర్మాణాన్ని చేపట్టారు. దీంతో అటు మంచన్‌పహాడ్ గ్రామస్తులతో పాటు చేగూరు, వెంకమ్మగూడ, యూనివర్సిటీ విద్యార్థులకు సైతం మార్గం సుగమమైంది.

ఎమ్మెల్సీ సహకారంతోనే..



మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డితో పాటు యూనివర్సిటీ సహకారంతో రూ.కోట్ల వ్యయంతో రోడ్డును అభివృద్ధి చేశాం. మాకు అనుబంధ గ్రామమైన మంచన్‌పహాడ్ గ్రామస్తులు గత కొన్నేళ్లుగా రోడ్డు, బ్రిడ్జి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సమస్యను పరిష్కరించేందుకు కృషి చేశా. మంచన్‌పహాడ్ గ్రామానికి అతి సమీపంలో గ్రామ పంచాయతీ నిధులతో కొంత మేరకు సీసీరోడ్డు వేశాం.

–ఉమారెడ్డి, తాజా మాజీ సర్పంచ్, మొదళ్లగూడ

సులభంగా ప్రయాణం



మా గ్రామం అనుబంధ గ్రామంగా ఉండటంతో పెద్దగా అభివృద్ధికి నోచుకోలేదు. తాజా మాజీ సర్పంచ్ ఉమారెడ్డి, ప్రస్తుత మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిలు మా గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించి సీసీ రోడ్డు, వాగుపై బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారు. ప్రస్తుతం ఏ రాత్రయినా, ఎంత వర్షం కురిసినా సులభంగా ఇంటికి చేరుతున్నాం. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాట్న మాధవి, ఎంపీటీసీ, మంచన్‌పహాడ్

దాతల సహకారం అభినందనీయం



ప్రశంసపత్రాలు, బ్యాగులు అందజేస్తున్న ఎంఈఓ, ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు

ఎంఈఓ శంకర్‌రాథోడ్

షాద్‌నగర్‌రూరల్: నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రగతి వెల్ఫేర్ సొసైటీ అందిస్తున్న సహకారం ఎంతో అభినందనీయమని ఎంఈఓ శంకర్‌రాథోడ్ అన్నారు. ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, చౌదరిగూడ, షాబాద్, బాలానగర్ మండలాల్లో పదో తరగతిలో 9 జీపీఏపైన సాధించిన విద్యార్థులు, ఇంటర్ తరువాత ప్రొఫెషనల్ కోర్సులు తీసుకునే నిరుపేద విద్యార్థులు, అనాథ విద్యార్థులకు ప్రగతి గ్రామీణ స్కాలర్‌షిప్ కింద 20 మంది విద్యార్థులకు చదువు పూర్తయ్యేవరకు ప్రతి విద్యా సంవత్సరం రూ.1లక్ష చొప్పున అందించేందుకు ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ముందుకొచ్చింది. ఆయా మండలాల్లో పది పాసైన సుమారు 400 మంది విద్యార్థులకు ప్రగతి వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అలోక్ అగర్వాల్ ఆధ్వర్యంలో బుధవారం ప్రశంసపత్రాలు, కాలేజీ బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ శంకర్‌రాథోడ్ హాజరై విద్యార్థులకు ప్రశంసపత్రాలు, బ్యాగులను అందజేశారు. కార్యక్రమంలో ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ఎడ్యుకేషనల్ మేనేజర్ జగదీశ్, సొసైటీ ప్రతినిధులు ప్రవీణ్‌అగర్వాల్, చంద్ర, కార్తీక్, శ్రీకాంత్, ప్రగతి, తులసి, లావణ్య, మానస, శ్వేత, శృతి, ఆయా మండలాల ఎంపీడీఓలు, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుంటే కఠిన చర్యలు

- చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం
- 12 వాహనాలు సీజ్

చేవెళ్ల: రోడ్డుపైకి వచ్చే వాహనాలకు తప్పనిసరిగా నెంబర్ ప్లేట్ ఉండాల్సిందేనని లేదంటే కఠిన చర్యలు తప్పవని చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం అన్నారు. మండల కేంద్రంలో బుధవారం రాత్రి నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ట్రాఫిక్ సిబ్బందితో పలు వాహనాలను తనిఖీ చేయగా 12 వాహనాలు నెంబర్ ప్లేట్ లేకుండా దొరికాయని వాటిని సీజ్ చేశామని చెప్పారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమని, అదే విధంగా ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగిన ఆ వాహనం ఎవరిది అనేది గుర్తించలేకపోతామన్నారు. కొత్త వాహనాలకు నెలరోజుల్లోనే కొత్త నెంబర్లు వస్తాయని వెంటనే వాటిని బిగించుకోవాలని చెప్పారు. ఇప్పటికైనా వాహనదారులందరూ తప్పనిసరిగా నెంబర్ ప్లేట్‌లను బిగించుకోవాలని సూచించారు. ఎస్ఐ విఠల్‌రెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్: షాబాద్ కేజీబీవీలో ఖాళీగా ఉన్న రెండు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ పాఠశాల ప్రత్యేకాధికారి కృష్ణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న వాచ్ ఉమెన్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఆసక్తి గల పదో తరగతి చదువుకున్న మహిళలు ఈ నెల 27 నుంచి 30వ తేదీవరకు షాబాద్‌లోని కేజీబీవీలో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



వెల్స్‌పన్ కంపెనీలో కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు



చేవెళ్ల: అవగాహన కల్పిస్తున్న సీఐ లక్ష్మారెడ్డి

చేవెళ్ల: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో మెలగాలని చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వివేకానంద కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్ఐ ప్రదీప్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డిలతో కలిసి విద్యార్థులకు మాదకద్రవ్యాలతో జరిగే ప్రమాదాలను వాటితో యువత భవిష్యత్ ఎలా నాశనం అవుతుందో అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువత మత్తులో చిత్తు అవుతూ వారి జీవితాలతో పాటు తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను కూడా నాశనం చేస్తున్నారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని మంచిపేరు తీసుకురావాలని సూచించారు. చెడు వ్యసనాలతో నష్టపోయిన కుటుంబాల జీవితాల గురించి విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాల వాడటం చట్టరీత్యా నేరమని వీటిపై ప్రభుత్వం పోలీస్‌శాఖ కూడా కఠిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

డ్రగ్స్ నివారణకు కృషి చేయాలి

షాబాద్: డ్రగ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐలు మహేశ్వర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం డ్రగ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ వెల్స్‌పన్ కంపెనీలో పనిచేసే ఇతర రాష్ట్రాల కార్మికులకు డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, నివారణ కోసం అందరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని రంగాపూర్‌లో కోట మైసమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కోట మైసమ్మ ఆశీస్సులతో గ్రామస్తులు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివ శంకర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, ఎంపీటీసీలు దేపల్లి కుమార్, నాయకులు సుదర్శన్‌గౌడ్, తులసీరాం నాయక్, గబ్రూ నాయక్, తోట మహేందర్, రమేశ్‌గౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వార్షికోత్సవంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి పూజలు చేసి ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, నందిగామ పీఏసీఎస్ చైర్మన్ రాజ్‌గోపాల్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సన్మానం



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందిన నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డిని ఆయన స్వగృహంలో బుధవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని బూర్గుల గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్‌రెడ్డిని పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నేటికీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో మాయమాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ నాయకులు ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల పక్షాన పోరాడుతానన్నారు. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించారని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో అశోక్‌కుమార్‌గౌడ్, సంతోశ్‌కుమార్ గౌడ్, హరికృష్ణగౌడ్, ప్రభాకర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

షాద్‌నగర్: ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అంజన్‌కుమార్‌తో కలిసి డాక్టర్ రవీందర్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందిస్తున్న విద్యా వివరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యతో పాటు అన్ని నైపుణ్య కోర్సులను అందిస్తుందన్నారు. అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, ప్రొజెక్టర్‌తో బోధన కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరం బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో బాలానగర్ కళాశాల అధ్యాపకులు చంద్రకాంత్, వినోద్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దళిత విద్యార్థికి న్యాయం చేయండి



వినతిపత్రం అందజేస్తున్న వినయ్‌కుమార్, రాజు

షాబాద్: దళిత విద్యార్థికి న్యాయం చేయాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కడారం వినయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు బేగరి రాజు పేర్కొన్నారు. బుధవారం నగరంలో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కోడిగంటి లక్ష్మయ్య, శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని కేసారం గ్రామంలో దళితుడు అయినటువంటి బేగరి రాములు కుమారుడు బేగరి యాదగిరి అదే గ్రామంలో విశ్రాంత ఉపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి ఇంటి దగ్గర జామపండు తెంపినందుకుగాను మైనర్ బాలుడిని చితకబాది కాళ్లు, చేతులు తాళ్లతో కట్టేసి కొట్టినట్లు తెలిపారు. నిందితులపై షాబాద్ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినా అరెస్టు చేయడంలో జాప్యం జరుగుతుందని చెప్పారు.

పాఠశాలల బంద్ విజయవంతం



శంకర్‌పల్లిలో బాలికల పాఠశాల విద్యార్థులతో కార్యకర్తలు



చేవెళ్లలో ప్రభుత్వ పాఠశాలలో నుంచి తిరిగి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు



షాద్‌నగర్‌రూరల్: పాఠశాలలను బంద్ చేయిస్తున్న ఏబీవీపీ నాయకులు

ఏబీవీపీ పిలుపు మేరకు చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల పరిధిలో బుధవారం పాఠశాలల బంద్ విజయవంతమైంది. ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలనే డిమాండ్లతో ఏబీవీపీ నాయకులు చేపట్టిన బంద్‌కు అనూహ్య స్పందన లభించింది. గ్రామాల్లో, పట్టణాల్లో పలు పాఠశాలలు స్వచ్ఛందగా బంద్‌కు సహకరించగా.. మరికొన్ని చోట్ల తెరిచి ఉన్న పాఠశాలలను ఏబీవీపీ నాయకులు మూసివేయించారు.



షాబాద్‌లో పాఠశాలలు బంద్ చేయిస్తున్న ఏబీవీపీ నాయకులు